క్లుప్తంగా

'ఇంటింటికీ సీపీఐ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కడెం: మండలంలోని చిన్నక్యాంప్ గ్రామంలో శుక్రవారం ఇంటింటికీ సీపీఐ పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు రాష్ట్రంలోని 119 నియోజవర్గాల్లో ఈనెల 14 నుంచి మే 14 వరకు సభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు భుక్య రమేశ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నమూనా నవోదయ పరీక్ష

ముథోల్: మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు నవోదయ నమూనా ప్రవేశపరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ముథోల్ నియోజకవర్గంలోని ముథోల్, కుంటాల, కల్లూర్, బాసర, భైంసా, నర్సాపూర్, ప్రాంతాల విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ అసంవార్ సాయినాథ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల యజమాన్యం ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేందర్, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

నిందితులపై చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెంబి: మండలంలోని ఓ గిరిజన బాలికపై అత్యాచారం చేసి.. గర్భస్రావం చేయించిన తులసీపేట్ గ్రామ యువకులపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నాయకులు శుక్రవారం పెంబి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ బాలకృష్ణకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. నలుగురు యువకులపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి తొడసం శంభు, గిరిజన సంఘం నాయకులు మంచికంటి లక్ష్మణ్, దేవురావు, శ్రీను, తదితరులు ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం గ్రామంలో బీరప్ప ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కుర్మ సంఘ సభ్యులు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కోరారు. శుక్రవారం దేగాంలోని ఎమ్మెల్యే ఇంటికి చేరుకుని వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఆయన నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. భూమేశ్, వెంకట్‌రెడ్డి, భోజన్న తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న 'కంటివెలుగు'

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో శుక్రవారం రెండో విడత కంటివెలుగు కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు కంటిపరీక్షలు చేయించుకోగా అవసరమైన వారికి కంటిఅద్దాలు పంపిణీ చేశారు. వైద్యులు శ్రీకాంత్, శ్వేత, సిబ్బంది యాస్మిన్, శివకృష్ణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	15
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : దసరా
నారాయణ: బలగం

గుట్టను తోడేస్తున్నారు

- రాచాపూర్ సమీపంలో అక్రమంగా మొరం తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు
- ఆదాయం కోల్పోతున్న ప్రభుత్వం



రాచాపూర్ సమీపంలో పాడవుతున్న రోడ్డు



రాచాపూర్‌లో తవ్వేసిన గుట్ట ప్రాంతం

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్-మూటాపూర్ సమీపంలోని గుట్టను అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ధనార్జనే ధ్యేయంగా రాత్రి, పగలనే తేడా లేకుండా మొరం, మట్టిని జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో భారీ టిప్పర్ల ద్వారా మూటాపూర్, అక్కపూర్ గ్రామాల మీదుగా మట్టిని జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

కన్నెత్తి చూడని అధికారులు

ప్రభుత్వ భూముల్లో మొరం తవ్వకాలు చేపట్టాలంటే మండల రెవెన్యూ, భూగర్భగనుల శాఖ అనుమతి తీసుకోవాలి. ఈ మేరకు ప్రభుత్వానికి కొంత ఆదాయం చెల్లించి తవ్వకాలు చేపట్టాలి. ఈ నిబంధనలను తుంగలో తొక్కారు. ఆరు నెలలుగా గుట్టను ఇష్టానుసారంగా తవ్వుతున్నా.. అటువైపు రెవెన్యూ, మైనింగ్ అధికారులెవరూ కన్నెత్తి చూడటం లేదు.

వారం రోజులకే దెబ్బతింటున్న రోడ్డు..

మండలంలోని రాచాపూర్ నుంచి మూటాపూర్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర వారం రోజుల కిందట తారురోడ్డు నిర్మించారు. ఈ మార్గంలో భారీ టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండటంతో నూతన రోడ్డు దెబ్బతింటుంది. అధికారులు మొద్దు నిద్ర వీడి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

అంబలితో ఆరోగ్యానికి మేలు

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి
- నిర్మల్‌లో పంపిణీ కేంద్రం ప్రారంభం



అంబలి పంపిణీ చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పక్కన రాంచందర్

నిర్మల్‌టౌన్: వేసవిలో అంబలి తాగితే ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద శుక్రవారం పాకాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి, తాగునీటి పంపిణీ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఆరేళ్లుగా రాంచందర్ వేసవిలో అంబలి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలకు ఈ అంబలి పంపిణీ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, సోన్ జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, పద్మనాభం, దశరథ్, లింగంపల్లి లక్ష్మీనారాయణ, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల మెడికల్ క్యాంపు ప్రారంభం

జిల్లా కేంద్రంలోని ఐఏ ఫంక్షన్‌హాల్‌లో హజ్ యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును మంత్రి ప్రారంభించి మాట్లాడారు. మైనార్టీలకు శనివారం నుంచి రంజాన్ కానుకలను అందిస్తామని తెలిపారు. హజ్ యాత్రకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. డాక్టర్ వేణుగోపాల్, కౌన్సిలర్లు, మతపెద్దలు పాల్గొన్నారు.

'లీకేజీల ప్రభుత్వాన్ని గద్దె దించాలి'



న్యూవెల్మల్‌లో మాట్లాడుతున్న భూమయ్య

నిర్మల్‌చైన్‌గేట్: ప్యాకేజీ, లీకేజీలకు కేంద్రంగా మారిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దె దించాలని బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమ తప్పిదాలను కప్పి పుచ్చుకునేందుకే బీఆర్ఎస్ అరెస్ట్ డ్రామా ఆడుతోందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేయడం.. కేసీఆర్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలన్నారు. ఘటనపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేపట్టాలని కోరారు. బీజేపీ కార్యకర్తలను పోలీసులు ముందుగా అరెస్టు చేశారని.. కాని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తే బందోబస్తు నిర్వహించారని అన్నారు. ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనకు జిల్లా నుంచి కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

లక్ష్మణచాంద: తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయి బీజేపీ పాలనను కోరుకుంటున్నారని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య అన్నారు. శుక్రవారం సోన్ మండలం న్యూవెల్మల్‌లో ఏర్పాటు చేసిన బూత్ స్వశక్తి అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో పదో తరగతి పరీక్షల పేపర్ల లీకేజీ జరిగితే బండి సంజయ్‌ను ఏ1గా చేర్చడం విడ్డూరంగా ఉందన్నారు. ఇందులో బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సాగర్, మండలాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, వినోద్, గంగాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

'బండి'ని కలిసిన జిల్లా నాయకులు



సంజయ్‌ను సన్మానిస్తున్న రామారావుపటేల్

భైంసాటౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బెయిల్‌పై విడుదలైన నేపథ్యంలో ముథోల్ నియోజకవర్గ నాయకులు పవార్ రామారావుపటేల్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. అనంతరం శాలువాతో సత్కరించారు.

ఖానాపూర్: బెయిల్‌పై తిరిగి వచ్చిన బండి సంజయ్‌ను ఆ పార్టీ ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు శుక్రవారం కరీంనగర్‌లో కలిసి తమ సానుభూతి ప్రకటించారు. ప్రభుత్వం తప్పుడు కేసులతో నియంత పాలన సాగిస్తుందన్నారు. సంజయ్‌ను కలిసిన వారిలో పెంబి జెడ్పీటీసీ జానుబాయి, నియోజకవర్గ నాయకులు అజ్మీరా హరినాయక్, రితీశ్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

నేడు దివ్యాంగులకు బస్‌పాసుల పంపిణీ

ఖానాపూర్: పట్టణంలోని బస్టాండ్‌లో శనివారం ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రాయితీపై బస్‌పాసులు పంపిణీ చేయనున్నట్లు నిర్మల్ డిపో మేనేజర్ సాయన్న తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు 50శాతం రాయితీతో బస్‌పాస్‌లు ఇస్తామన్నారు. ఆర్థో విభాగంలో 40శాతం ఉన్న దివ్యాంగులు, చెవిటి, మూగ, అంధులు 100శాతం వైకల్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. మేళాకు వచ్చేవారు సదరం సర్టిఫికెట్‌తోపాటు ఆధార్ జిరాక్స్, ఫొటో, రూ.50 చెల్లిస్తే ఐడీ కార్డు ఇస్తామని పేర్కొన్నారు. దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లక్ష్మణచాంద: సాధారణ మరమ్మతుల్లో భాగంగా మండలంలోని మల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

రోడ్డు పనుల్లో జాప్యంతోనే ప్రమాదం

ఖానాపూర్: పట్టణంలో రోడ్డు వైడింగ్ పనుల్లో జాప్యం నెలకొనడంతోనే ప్రమాదం జరిగి నిండు ప్రాణం బలి అయిందని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌తోపాటు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇంకెన్ని మరణాలు చూడాల్సి వస్తుందోనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్‌కు కౌన్సిలర్లమంతా ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. శనివారం నుంచి రోడ్డుపై దుమ్ముధూళి లేకుండా నీటిని పట్టించకుంటే ఆదివారం నుంచి రోడ్డుపై నిరాహారదీక్ష చేస్తామని హెచ్చరించారు. పనుల్లో నిర్లక్ష్యంపై మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కాంట్రాక్టర్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యేపై సైతం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్లు స్రవంతి, అఫ్రినాబేగం, గుగ్లావత్ కిశోర్‌నాయక్, ఫౌజియాబేగం ఉన్నారు.

ఘనంగా తెప్పోత్సవం

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి, పీచర గ్రామాల ప్రజలు సమీపంలోని గోదావరిలో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. తెప్పలు తయారు చేసి గోదావరిలో వదిలారు. తమను సల్లంగా చూడాలని వేడుకున్నారు.

ఇంకెన్నాళ్లు.. జీపీ భవన నిర్మాణం

- హిప్నెల్లిలో ముందుకు సాగని పనులు
- శిథిలావస్థకు చేరిన పాతభవనంలోనే విధులు
- ఐదేళ్లుగా పట్టించుకోని అధికారులు



జీపీ కార్యాలయం కొనసాగుతున్న పాత భవనం



పునాదులకే పరిమితమైన నూతన పంచాయతీ భవనం

తానూర్: మండలంలోని హిప్నెల్లి గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మారడంతో అధికారులు పాతభవనంలో విధులు నిర్వర్తిస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఐదేళ్ల కిందట ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి రూ.13 లక్షలు మంజూరయ్యాయి. కాని పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ బెస్‌మిట్(పునాది) లేవల్ వరకు పనులు చేసి అర్ధంతరంగా వదిలేశాడు. బిల్లులు రాకపోవడంతోనే పునాదుల వరకు పనులు చేసి నిలిపివేశాడని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు.

ఆలయంలోనే గ్రామసభలు, సమావేశాలు..

దీంతో పంచాయతీ కార్యాలయ సిబ్బంది శిథిలావస్థకు చేరిన పాత పాఠశాల భవనంలో విధులు నిర్వర్తిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామసభలు, సమావేశాలు నిర్వహించిన సమీపంలోని హనుమాన్ ఆలయంలో నిర్వహిస్తున్నారు. నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరించాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు భవన నిర్మాణం పూర్తి చేసి మా ఇబ్బందులను దూరం చేయాలని పలువురు సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుపై పారుతున్న మురుగు



ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ముత్యాల పోచమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో మురుగునీరు రోడ్డుపై నుంచి పారుతోంది. దీంతో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు డ్రైనేజీతోపాటు పైప్‌లైన్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రత్నాకర్‌రావు, మున్సిపల్ కమిషనర్, ఫోన్ : 94400 40793

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



మాదాపూర్‌లో ప్రార్థనలు చేస్తున్న మహిళలు



పెద్దూర్ చర్చిలో ప్రార్థనలు

లక్ష్మణచాంద: సోన్ మండలవ్యాప్తంగా శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ఏసుక్రీస్తును స్తుతిస్తూ సామూహిక ప్రార్థనలు చేశారు.

కడెం: మండలంలోని పెద్దూర్, పెద్దబెల్లాల్, నచ్చన్ ఎల్లాపూర్, దిల్దార్‌నగర్, తదితర గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులకు సందేశం వినిపించారు.

ఖానాపూర్: జీసస్ మహా త్యాగానికి గుర్తే గుడ్ ఫ్రైడే అని సుర్జాపూర్ ఏఎంఎం చర్చి బ్రదర్ ప్రవీణ్ అన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా సుర్జాపూర్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా ఆయన మాట్లాడారు. వివిధ గ్రామాల క్రైస్తవులు తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

'నిరుద్యోగుల్ని మోసం చేస్తున్న బీఆర్ఎస్'



కాగడాల ప్రదర్శన చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

ఖానాపూర్: రాష్ట్రంలో ప్రభుత్వమే పేపర్ లీకేజీలను చేస్తూ నిరుద్యోగులను మోసం చేస్తోందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ లోకిని రాము, పార్టీ యూత్ జిల్లా అధ్యక్షుడు శ్రీపాద శేషాద్రి అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇచ్చిన ఐదు రోజుల నిరసనల పిలుపులో భాగంగా శుక్రవారం రాత్రి పట్టణంలో కాగడాల ప్రదర్శన చేశారు. ప్రభుత్వం వెంటనే పేపర్ లీకేజీతో నష్టపోతున్న నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు పానగంటి నరేశ్, యూత్ మండల అధ్యక్షుడు ఎగుర్ల మహేశ్, మైనార్టీ సెల్ పట్టణాధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్, కరిపె రాజన్న తదితరులు ఉన్నారు.

'నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం'



ఖానాపూర్ నియోజకవర్గ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బన్సీలాల్

ఖానాపూర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలతో 30లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బన్సీలాల్ రాథోడ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఖానాపూర్ నియోజవర్గ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొందరి చేతిలో బందీ అయిన తెలంగాణను అందరి తెలంగాణగా చేసేందుకు యువత తరలిరావాలన్నారు. కేసీఆర్ పాలనలో లీకేజీలు, లిక్కర్ స్కాంలు తప్ప చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్, నాయకులు కుక్కారికారి రాజేష్, ఎస్కే లక్ష్మి, తదితరులు ఉన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రథోత్సవం కనుల పండువగా సాగింది. రథబలి, నిత్యహవనం, హోమం వంటి కార్యక్రమాలను అర్చకులు విజయస్వామి నిర్వహించారు. గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన వీధుల గుండా రథం ఊరేగింపు నిర్వహించారు. పలువురు వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు..

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో హుండీ ఆదాయాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.2.70లక్షలు సమకూరినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పరామర్శ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్‌కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చంద్రహాస్ భార్య, తమ్ముడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రేఖానాయక్ పరామర్శించారు. వారి వెంట నాయకులు ఉన్నారు.